# కవితా కౌముది

## ఆ రాత్రి చాలా బరువుగా ఉంది    శ్రీఅరుణం శ్రీనివాస్

అందమైన చందమామ మోయలేనంత భారమైనట్లుంది,
వేకువకు దారి వెతుకుతూ...వేగంగా చొరబడదామంటే...
పలకరించటం కూడా మర్చిపోయిన అరుణం
ఎక్కడో....మబ్బుల మాటునుండి నాపై నిందలు వేస్తుంది
జోరున వర్షిస్తున్న మేఘాలను నేనేమైనా సృష్టించానా?
నాకు చోటున్నంతవరకూ పచ్చగా ఉండాలనే అల్లుకున్నాను
నన్ను త్రోసేసి కట్టుకున్న రాతి కట్టడంలోంచి...
ఉక్కబెడుతున్న జీవితాన్ని ఉగ్గబెట్టుకుని...
మళ్ళీ...నన్నే...నిందిస్తుంది,
తన తాపత్రయం కానీ...
కష్టం చెప్పుకోకుంటే...కన్నీళ్లు తుడిచేదెవరు
కలం చెంత లేకుంటే...కావ్యం రాసేదెవరు
పలకరింపును కూడా పక్కన పెట్టేస్తుంటే
పగలుకు,రాత్రికి మధ్యన తేడా తెలిసేదెలా....
అంతా...నిరాశే అనుకుంటే..ఆశకి చోటెక్కడ...
శిక్షించటానికి దారులు చాలా ఉంటాయి
కానీ....
క్షమించే దారులు వెతకటమే ఆనందం,
ఉరిమే ఉరుముని కాదు, కురిసే మేఘాన్ని ప్రశ్నించు
నీ... అన్వేషణకి అంతరాత్మ దొరుకుతుంది

★★★

# ఏమైనా అనుకోవాలి

శ్రీసాహితి

ఈ తేమ
కురిసే ప్రేమది కాదు...
గాయపడ్డ ఇష్టానిది..!
ఈ సంతోషానికి
అందం లేదు
వేసుకున్న వేషానిది...!
ఈ ఖర్చు
సొంతం కాదు
దొంగిలించిన నమ్మకానిది..!
ఈ కలివిడి
కోరుకున్నది కాదు
ప్రదర్శించబడే కళ..!
ఈ మనసుది
మర్యాద కాదు
మాటల్తో చల్లబడే మత్తు...!
ఈ సంబంధం
పందిరి లేనిది
పట్టింపు లేని పెంపకం..!
ఈ మనసు
ఎవరిదో కాదు.
ఏమైనా అనుకోవాలి ..!!

★★★

# నిశ్శబ్ద లిపి

రవి ప్రసాద్ చెలమల్లు

కొలను అలలపైన
రాత్రంతా వెన్నెలరేడు
ఊరేగింపు సాగుతున్నప్పుడు,
ఏకాకి సూరీడు
చీకటి దుప్పటి తీసి
మడత వేస్తున్నప్పుడు,
నిశ్శబ్దం అక్షరాలై రాలుతుంది!

మనసెరిగిన తోడుతో
కలిసి నడిచేవేళ
మాటలు మొలవకనే.
పెదవుల విరిసే హాసం,
ఏకాంతంలో అంతరంగంలోకి
జరిగే పయనంలో
మూసిన కన్నుల వెనుక
కురిసే మౌనం,
నిశ్శబ్దం అక్షరాలై రాలుతుంది

★★★



# రసరేఖలు

శ్రీధర్ బచ్చోటి

నిశ్చలమ్ముగనున్న యీ నీరమందు
విసిరిరెవ్వరీ రాయినీవేళయందు
నెమ్మనమ్మున శాంతమ్ము నిండినపుడు
చెవిని రొదచేయు జోరీగ చిత్తమేమి?

అవని విశ్రాంతినొందు యామవతివేళ
తారలను మేల్కొలుపునుల్కధారలెన్నొ
తారలనె కాదు మనబోటి వారిగూడ
లేచి రమ్మంచునాహ్వానలేఖలంపు

చీమ చిటుకుమనని యీ నిశీథమందు
ప్రచురఘోష చేయునశనిపాతమొకటి
వర్షధారలు పెద్ద శబ్దములు చేసి
ప్రజల మేల్కొల్పు ఫెళఫెళార్భటులతోడ

శబ్దశూన్యత యన్నదాశ్చర్యజనక
మీ ధరణియెల్ల సృష్టిలోనెచ్చటైన
చలనమన్నదెల్లెడల గోచరము మనకు
చేతనము లేనిచో లేదు జీవితమ్ము

సర్వమును శబ్దమయము విశ్వమ్మునందు
సకలజీవనయానమ్ము చలనమయము
జాగృతియె జీవితమునకు సంజ్ఞ యౌను
ప్రకృతి మేల్కొలుపు సుషుప్త్యవస్థనుండి

COMMENTS